**అనురాగం సాధించలేని శాంతినీ, సౌఖ్యాన్నీ ఒకోసారి అసూయ సాధించడం ఆశ్చర్యం కాదూ!**

తలగడాలో తల దూర్చి వెక్కి వెక్కి ఏడుస్తోంది రాధ! ఆమె అలా పది రోజులనుంచీ ఏడుస్తోంది. ఆమె పెళ్ళయికూడా పది రోజులైంది.

రేడియో వాల్యూమ్ తగ్గింది. లైటు తీసేస్తూ రాధ దగ్గరగా వచ్చేడు రవి.

"రాధా! నీ మనసులోని మాట సూటిగా చెప్పకూడదూ నేనంటే ఇష్టం లేదని. ఈ పది రోజులలో ఒక్కనాడు కాకపోతే, ఒక్కనాడైనా నాతో సరదాగా గడపావా! కనీసం నీకు పెళ్ళయిందన్న విషయంగాని, నీకో భర్త ఉన్నాడన్న మాటగానీ జ్ఞాపకం లేదనుకుంటాను." భుజంమీద చెయ్యి వేసి కుదుపుతూ అన్నాడు.

అప్పటికే రాధ నిద్రపోయింది. ఆమె నిద్ర పోలేదని అతనికి తెలుసు - అది గ్రహించాడని ఆమెకీ తెలుసు.

గణగణమంటూ పన్నెండు గంటలు కొట్టింది గోడ గడియారం.

సారథిని మరిచిపోలేనని తనకు తెలుసు. తలదిండుమీద ఎన్నోకలలు — ఇంకెన్నో ఆశలు అందంగా అల్లుకున్నా, విధి చేతిలో కీలుబొమ్మలైపోయారైనా. తన ప్రేమ ముమ్మాటికీ సారథికే: "ముమ్మాటికీ నీదే!" అనుకోలేని దుఃఖంతో బిగ్గరగా అనేసింది రాధ!

"రాధా! కలవరిస్తున్నావా. ఒత్తిగిలి పడుకో!" అన్నదాకా ఈ లోకానికి రాలేదు రాధ.... ఒక్కసారి త్రుళ్ళి పడింది.

మిగిలిన రాత్రి అలాగే నిద్రపోయింది.

రాధ సారథిని ముందు ప్రేమించిందో లేక సారథే రాధని ముందు ప్రేమించాడో గాని ఒకరి నొకరు గాఢంగా ప్రేమించు కున్నారు. కథలు. సినిమాలు చదివి చదివి. చూసి చూసి అందమైన కలలు కన్నారు. తెగించి రాధ ఒకనాడు తన ప్రేమ విషయమై తండ్రికి తెలియచేసింది.... సరే నమ్మా నీ యిష్టమే నాయిష్ట మన్నాడు తండ్రి రాఘవయ్య! తీరా సారథి, సారథి కుటుంబ విషయాలు తెలుసుకున్నాక — సారథి నవమానించి - చస్తే ఈ పెళ్ళి జరగడానికి వీల్లేదు పొమ్మన్నాడు. మరణించిన సారథి తండ్రి ఇతనికి బద్ధ శత్రువట! అంతే. వారం తిరక్కుండా వేలు విడిచిన చెల్లెలు శాంతమ్మ కొడుకు రవి కిచ్చి ముడిపెట్టి మీసం మెలివేసుకున్నాడు.




## 2

అదిమాత్రం అందమైన సాయం కాలం.

చదువుతున్న పుస్తకం ఆపి గుండెల మీద వేసి శూన్యంలోకి చూస్తున్నాడు సారథి.

"బావా!"

ఉలిక్కిపడి — "ఓ నువ్వా శశీ!.." అన్నాడు సారథి.

"కాఫీ."

"నిన్నే బావా తీసుకోమంటూంటే!"

"అక్కడపెట్టి వెళ్ళు శశీ-విసిగించక" కణతలు నొక్కుకుంటూ అన్నాడు.

టేబులుమీద కాఫీపెట్టి విసురుగా వెళ్ళిపోయింది శశి.

బరువుగా- బద్దకంగా- ఈజీ చెయిర్ లోంచి లేచి కాఫీ త్రాగడం ముగించాడు.

చొక్కాచేతులు మడుచుకుంటూ- డాబా పిట్టగోడదాకా వచ్చి- దాని మీద చేతులాన్చి నీలాకాశంలోకి చూశాడు.

ఆకాశం అమాయకమైన అమ్మాయిలా ప్రశాంతంగా ఉంది.

రివ్వుమని రెండు పక్షులు కిచకిచలాడుతూ దూరంగా దూసుకుపోతున్నాయి.

వాటివైపు ఈర్ష్యగా చూస్తూ- సిగరెట్ నోట్లో పెట్టుకున్నాడు. వెలిగించి రెండు మూడు ....పఫ్.... లాదిలాడు. పొగ ఉంగరాలుగా చుట్టుకుంటూ ఆకాశానికందు కుంది.

ఇంకటు చూడలేకపోయాడు.

క్రింద వాటా అందమైన జంట ఒకరి నొకరు పెనవేసుకొంటూ స్కూటరుమీంచి పోతున్నారు.

ఆ దృశ్యం చూడలేక కళ్ళు మూసు కున్నాడు జెలసీతో. జాలుగోడనుంచి జారడానికి సిద్ధమవుతున్న యిటుకబెడ్డను గురిచూసి విసిరి కొడదామనుకొన్నాడు!

తన్ను తానే నిందించుకుంటూ — గదిలోకొచ్చి రేడియో ట్యూన్ చేశాడు.

వివిధ భారతి నగంనుంచి పాటందు కుంది.

"అదే నిజములే! నీవు లేక నేను లేనులే- పూవులేక తావి నిలువలేనిదే.... తొలినాటి రేయీ—తడబాటు పడుతూ...."

ఒక్కసారి అరిచేత్తో రేడియో బద్దలు కొట్టాలనుకున్నాడు! రేడియో ఆఫ్ చేశాడు.

పక్కింటి వాటా రేడియో— పంచమ

స్వరంతో మిగతా పాట కంప్లీట్ చేస్తోంది!

ఇది భరించలేక – వెర్రిగా జుట్టు పీక్కుంటూ క్రిందికి వెళ్ళిపోయి బట్టలు మార్చుకొని. ఎవరో తరుముకొస్తున్నట్టు వీధిగుమ్మం దాటాడు.




## 3

అద్దంలో ప్రతిబింబం చూసుకుంటూ. కనుకొనల కాటుక దిద్దుకొంటోంది రాధ. అద్దంలోంచే షైట సర్దుకుంటూన్న రవిని చూస్తూ..."ఈ వాళ వెళ్ళకపోతేనేమండీ! మరో రోజు వెళదాం ...."అంది మెల్లగా.

పోకెట్‌లోంచి సిగరెట్ కేసు తీస్తూ. చేతివేళ్ళ మధ్య సిగరెట్ ఉంచుతూ.... తీక్షణంగా చూశాడు రవి.

ఆ చూపులోవేయిచూపులున్నాయి. అతని చూపుల్ని తప్పించుకొంటూ డ్రాయరు సొరుగులోని హేండ్ బాగ్ తీస్తూ.... "సరే పదండి...." అంది.

పెదిమల మధ్య పెట్టుకొన్న సిగరెట్ లైటరుతోవెలిగిస్తూ "చూడురాధా: మొగుఉంటే యముడేం కాదు! నీ కిష్టంవుంటేనే లా!.........బలవంతం లేదు. అమ్మకి నేనెలాగూ సర్ది చెబుతాను. కాని ఒక్క మాట !....బ్రతికినంత కాలం బ్రతకని మా అమ్మ ఈ వయస్సులో మొన్న పెండ్లయిన మనం కీచులాడుకోవడం చూసి భరించలేదు. కనీసం ఆవిడ సంతృప్తికైనా. సంతోషానికైనా శాంతి చేకూర్చే బాధ్యత నా భార్యగా కాకపోయినా....ఈ యింటి కోడలిగా నీకుందన్న మాట మరచిపోకు...."తీక్షణంగా అంటూ వెనక్కు తిరిగి కిటికీ చువ్వలు పట్టుకొని రోడ్డువైపు చూస్తూ....పొగ వదిలాడు.

"నేనేమన్నానని దానికింత రాద్ధాంతం. సిద్ధాంతం చేస్తున్నారు?" గుడ్లనీరు నింపుకుంటూ భయంతోను. కోపంతోను. పౌరుషంగా అంది.

సగం కాలిన సిగరెట్ కాలిబూటుతో నలిపేస్తూ చిరునవ్వుతో .... ఆమె వైపు తిరుగుతూ ....

"సరే-పద! అమ్మాయిగారికి కోపం వచ్చినట్టుంది. షాపింగుకైతే మరోరోజు వెళ్ళవచ్చు. కాని ఈ రోజు – ఇలాటి రోజు కాదుగదా? షాపింగుకు. షికార్లకు. సినిమాలకూ.నాకూ ఓ అందమైన పెళ్ళాం ఉందని లోకానికి చాటటానికి కాదు. నీతో అన్యోన్యత పెంచటానికి-నీ అనురాగాన్ని పొందటానికి!" రాధ భుజంమీదచేయివేసి. వాల్చిన ఆమె మోము పైకెత్తుతూ– అన్నాడు.

"దిన దినానికి ఒకరినొకరు అర్థంచేసుకొని చేరువవటం పోయి, వేరవుతున్నాం.

ప్రఖ్యాతి చెందిన!
ఖటావ్ మిల్లు వారి
* 1001 పాలియస్టర్ చీరలు
* వాయిల్, ఆర్ వాయిల్ చీరలు
* షర్టింగులు, ఖద్దరుకోర్ ధోవతులు
* ప్రింటెడ్ చీరలు, 2×2 రూబియాలు
* సూటింగులు... వగైరాలకు
విజయ షో రూమ్
ప్రత్యేక ఖటావ్ మిల్లు వస్త్రముల షోరూమ్
J.D. హాస్పటల్ రోడ్డు,
గవర్నరుపేట, విజయవాడ-2.

కాయకల్ప చికిత్స
ఈ చికిత్సవలన 3 లేక 4 మాసములలో జుట్టు రాలిపోవుట ఆగిపోయి, దట్టముగా వెంట్రుకలు పెరుగును. అకాలములో నెరసినవెంట్రుకలు నల్లబడును. చర్మం తొలగిపోయి కండ్లజోడుతో నిమిత్తములేకుండామంచి చూపు వచ్చును. కదలిపోయిన వండ్లు మరల బిగిసిపోవును. తల్లి గర్భమునుండి జన్మించినప్పుడు దేహమునకు ఏ రంగు వున్నదో మరల ఆ రంగువచ్చి సౌందర్యము అభివృద్ధియగును.
వివరములు కోరువారు పోస్టు ఖర్చులకు రూ. 4-00లు యం.ఓ. పంపవలయును.
మేనేజరు
శ్రీ యోగాశ్రమ్,
పెదవాల్తేరు,
విశాఖపట్టణము-17.

నేనంటేయిష్టంలేదా? నేనంటే ఎందుకింత అసహ్యం?? ఎందుకింతకక్ష???..." ఆమె భుజాలు కుదుపుతూ ఉద్రేకంగా అన్నాడు.

నిశ్చేష్టురాలై బెదురు కళ్ళతో.... బితుకుగా గుండెమీద చేయి వేసుకొని, కాదన్నట్టు తలాడించింది.

చిరుచెమటతో నిండిన ఆమె నుదుటిని- చిరునవ్వుతో జేబు రుమాలుతో ఒత్తుతూ "నేనిప్పుడన్నమాటలు నీ కింత బాధకలుగజేస్తాయనుకో లేదు! ....ఏమీ అనుకోకు. సున్నితంగా ఆమె బుగ్గమీద చిటికవేస్తూ.. పెద్ద పెద్ద అంగలేస్తూ మేడమెట్లు చకచకా దిగుతూ, ఒక మలుపులో బిగ్గరగా "నువ్వే గంగా రావాలి నే కిందనుంటా !"నంటూ కిందకి దిగిపోయాడు.

వెళ్ళిపోతున్న భర్తవంక విస్మయంగా చూస్తూ అలాగే నిలుచుండిపోయింది రాధ.

ఆవాళిటికి రాధా- రవి.... భార్యా—భర్తలై పదహారు రోజులైంది. పదహారు రోజుల పండుగ దివ్యంగా జరిపించి, కొత్తకోడల్ని చూసి సంబరపడిపోతున్న శాంతమ్మ- కొడుకుతో భార్యను స్వయంగా షాపుకు తీసికెళ్ళి చీరలు కొని పెట్టమంది. రాధ తత్వం తెలుసుకొన్న రవి - తప్పుకుంటూ .... ఆ పని నువ్వే ఎందుకు చెయ్యకూడదన్నాడు. సిగ్గుపడుతున్నాడేమోనని.. సినిమాకేనా తీసుకెళ్ళమంది కొడుకును మందలిస్తూ. తల్లిమాట కొట్టివేయలేక సరే షాపింగుకే తీసుకెడతానన్నాడు.

హఠాత్తుగా ఆ నిముషంలో— ఆమె అంతరంలో అవ్యక్తంగా భర్త మీద గౌరవం ఏర్పడింది.... తనిలా కుమిలి.... పోవడమేగాక భర్తను కూడా.... భార్యగా ఏ విధంగా సుఖపెట్టలేకపోతున్నానని గుర్తించింది, తనకు తెలుసు సారధి తనవాడు కాలేడని. కాడని.... అయినా ఏదో ఒక భ్రమ - అంతలో ఏదో ఒక బాధ.... తనని పీడిస్తున్నాయి. తన మనసు సారధి వైపే పరిగెత్తుతోంది. దానికి కళ్ళెం వేసే శక్తి తనకు లేదు! కాదు-తన స్థితిలోఉన్న ఏ స్త్రీకీ ఉండదేమో!

తనూ-సారధి గడిపిన దినాలు ఒక్కొక్కటి నేటికీ జ్ఞాపకాలై తన్నేడిపిస్తున్నాయి నిన్ను అన్యాయం చేసినందుకు తగిన శిక్ష వేస్తున్నావ్ సారధీ - అనుకుంది బాధగా ! తనెంత ప్రసన్నంగా ప్రవర్తిద్దామనుకొన్నా భర్త ఎదురుపడేసరికి సారధి జ్ఞాపకమొస్తున్నాడు. భగవాన్ ! నన్నెందుకు మనసున్న ఆడదానిగా సృష్టించేవనుకుంటూ చెక్కిలిపై జారిపడే కన్నీటిని కొంగుతో వత్తుకుంది.

మంచంపై నడుం వాలుస్తూ ఈపాటికి సారధి ఏం చేస్తూ వుంటాడో?....ఇలా అతనుమాత్రం యెంతకాలం వుంటాడు? అలా తలిస్తే తన మనసు జెలసీతో నిండిపోతుందేం ? ఛీ....ఛీ....పాడు ఆలోచన. పొగరుబోతు గుర్రంలా స్వారీ చేస్తోంది.సారధి ముమ్మాటికీ తన కోసమే దుఃఖిస్తూ వుంటాడు. తన్నెంత గాఢంగా ప్రేమించేడు.ఇలా తనకు తాను సరిపెట్టుకుంటూ వుండగా అప్రయత్నంగా మరో సారి ఆమె కనులు చెమర్చాయి.

"ఏం చేస్తున్నావు ?....అవతల రిక్షా వాడు తొందర పెడుతూవుంటే !" గదిలోకి అడుగుపెడుతూ కేకవేశాడు. ఆమె స్థితి గమనించి, "రాధా! ఏమిటా ఏడుపు ఇందాక నేనన్నదానికే యింత అలకా? లే.లే!.." ఆమెను లేవనెత్తుతూ అన్నాడు.

అదిరిపాటుతో లేచిన రాధ- పైట సరి చేసుకుంటూ."అబ్బే? ఏంలేదండీ! కంట్లో నలుసుపడితే ...." సగంలోనే మాట తుంచేస్తూ.... "కంట్లో నలుసు పడిందాలేక కంట్లో నలుసులా నేను పడ్డానా? పట్టుదలకీ ఒక హద్దుండాలి...."

అతని మాటలు వినిపించుకోకుండా....

"ఇప్పుడే వచ్చేస్తున్నా!"అంటూ కిందకెళ్ళి ముఖం వాష్ చేసుకొని- ఎర్రని జీర కళ్ళతో భర్తతో రిక్షా ఎక్కింది.

## 4

టపటపా చినుకులు వంటి మీద ఒక్కసారి రాళ్ళలా పడేసరికి, ఆలోచిస్తూ నడుస్తున్న సారధి ఉలిక్కిపడి ఈ లోకానికొచ్చాడు. గబగబా రెండడుగులు వేసి ఒక గుమ్మం ఎక్కాడు. పోకెట్లోంచి కర్చీఫ్ తీసి ముఖం అద్దుకొని, జేబులో పెట్టుకుంటూ టైము చూసుకున్నాడు.

గాలితోపాటు వర్షం పుంజుకుంది. అప్పుడే వెలిగిన స్ట్రీట్ లైట్స్ వెలుగుతూ ఆరుతూ- ఆరలేక వెలుగుతూవున్నాయి. పాట కచేరీలో శ్రోతల్లా దూరాన కొబ్బరి చెట్లు గాలికి తలలాడిస్తున్నాయి!చురుక్కుమనే ఒక మెరుపు ! ఎక్కడో.... గుండె దద్దరిల్లేట్లు ఒక పిడుగు.... ఆకాశం భోరుమని ఏడుస్తూన్నట్టుంది.

రోడ్డుమీద ఉండి ఉండి పరుగెడుతున్న కార్లు- రిక్షాలుతప్ప జన సంచారం లేదు.

తనతోపాటే గుమ్మంపక్కన కాలేజీ స్టూడెంట్ హుషారుగా ఈలవేస్తూ కురుస్తున్న వర్షాన్ని చూస్తున్నాడు.

ఖాండ్రించి ఉమ్ముతూ, ఏదో గొణుక్కుంటూ, చలిగాలికి వణుకుతూ- ఓ ముసలి రిక్షావాలా బండినాపేడు.

టోపీ సరిచేసుకొంటూ- బట్టలు పిండుకొంటూ, "వస్తారేటి బాబా....!" అన్నాడు. ఆశగా సారథివంక చూస్తూ.

"ఊ !...." అన్నాడు సారథి రిక్షా యెక్కుతూ.

"ఎక్కడికి బాబూ ?"

"గాంధీనగరం !"

రిక్షా సాగిపోతోంది బరువుగా,

వర్షం పల్చబడింది.

దూరాన్నుంచి ఏదో రిక్షా వస్తోంది !

ఆలోచిస్తున్న సారథి అనుకోకుండా ఆ రిక్షావేపు చూశాడు.

అతని గుండెల్లో ఒక్కసారి ఫిరంగి పేలినట్లయింది. రాధలాగుంది- రాధేనా! అనుకున్నాడు. పరిశీలనగా చూద్దామనుకొని కనులు మూసి కనులు తెరిచేంతలో రిక్షా పక్కసందులోకి తిరిగి కనుమరుగైంది. కంటికి పొరకమ్మించే వర్షాన్ని తిట్టుకున్నాడు మనసులో.

హృదయానికి హృదయమై ప్రేమించి - తన ప్రేమను చూరగొన్న రాధ నేనా తను చూసింది ? కాదు ! ఆమె ముమ్మాటికి రాధ కాదు. కాకూడదు. ఆమె ప్రక్క తీవిగా కూర్చుని ఏదో మాట్లాడుతున్న వ్యక్తి ఆమె భర్త కాబోలు! ఎంతధికారం ? తన అవివేకానికి తన్నుతానే నిందించుకున్నాడు. తాళిగట్టినవాడు గాక తనలాటి పరాయివాడెలా అధికారం చెలాయించగలడు ?

ఇలా తలచేటపుడు హృదయం ఆపలేని వుద్రేకం, అవమానం, అసూయలతో నిండి వుడికిపోయింది.

ఆయాసంతో బుసకొడుతున్న రిక్షావాడు సారథి సూచించిన యింటి గుమ్మంముందు రిక్షా ఆపేడు.

పోకెట్‌లోంచి రెండు రూపాయల కాగితం యిచ్చి విసురుగా వెళ్ళబోయిన సారథిని రిక్షావాడు బాబూ చిల్లర అంటూ డబ్బు లివ్వబోయాడు.

"నీ దగ్గరేవుంచు!" అంటూ యింట్లోకి అడుగు పెట్టేడు.

మేడ మెట్లెక్కి గదిలోకి ప్రవేశిస్తూ లైటు స్విచ్ నొక్కాడు. బట్టలు మార్చుకొని టేబుల్ పైనున్న పేపరు తీసేడు. అక్షరాల్ని చూస్తున్నాడు తప్పిస్తే- అతని మనసు పేపరుమీద లేదు.... కొన్ని నిమిషాల క్రితం జరిగిన సంఘటన మీదే మెదలుతోంది.

బహుశా ఆమె రాధ కాకపోవచ్చు. పచ్చకామెర్ల రోగికి లోకమంతా పచ్చగా కనిపించినట్లు రాధవయసులోనున్న ప్రతి ఆడదీ తన కలాగే కనపడుతుందేమిటి— ఖర్మకాకపోతే. ఇందాక కాఫీ తేవడానికొచ్చిన శశి— ఒక ఏంగిల్‌లో అచ్చు రాధలాగే కనిపించడమేమిటి? గుడ్డిగా ప్రేమించిన తనని- రాధ.... గుడ్డివాణ్ని చేసి తప్పుకుంది. అవును.... ప్రేమగుడ్డిది అనుకున్నాడు కసిగా సారథి.

అతను ఆలోచనల్లోంచి తేరుకునే టప్పటికి గదంతా చీకటిగా వుంది. ఫ్యూజ్ పోయిందనుకున్నాడు.

"అమ్మా ! శశి చేత ఒక కొవ్వొత్తి పంపించుదూ !"

"శశి అన్నం తింటోందిరా ?.... నీకూ వడ్డించా. వేగిరం రా. నేనవతల హరికథకు గుళ్ళోకిపోవాలి.. " క్రింద నుంచి కేకేసింది అనసూయమ్మ.

కాళ్లు కడుక్కుని సారథి భోజనానికి కూర్చున్నాడు. అప్పుడే అన్నం తిన్న


వినూత్న సాంప్రదాయానికి నాంది

స్వాతి*

★ సర్వోన్నతమైన నాణ్యత
★ సర్వోన్నతమైన పనితనం
★ సర్వోన్నతమైన సుందరరూపం

దేశంలో 7 సం॥లు
గ్యారంటీతో లభించే
ఒకే ఒక కుట్టుమిషన్
మీ ఇంటికే అలంకారం




SWATHI*

సుదృఢమైన నిర్మాణానికి ప్రతీక

Advavo

శశి. చేయి కడుక్కొందుకు బైటకు వెళ్ళింది.

సారథికి గరిటెతో నేయి వేస్తూ అనసూయమ్మ—"అమ్మా! శశిరేఖా! గది గూట్లో కావ్యొత్తి మేడమీద పెట్టిరామ్మా! అంది.

"అలాగే అత్తయ్యా!" అంటూ శశి గదిలోకి దారి తీసింది.

సారథి మౌనంగా అన్నం కలుపుతున్నాడు.

"మామయ్య ఉత్తరం రావేదురా!...." విశ్శబ్దాన్ని చీలుస్తూ అంది అనసూయమ్మ. నోట్లోకి అన్నంముద్ద పెట్టుకుంటూ అలాగా అన్నట్టు చూశాడు.

"ఈ ఏడాదిలోగానేనా. నీచేత శశికి ఆ మూడుముళ్లూ వేయించాలంటున్నాడు!"

చెంబులోని నీళ్ళు గ్లాసులోకి వంచుకుంటూ "పాతపాటేగా!" అన్నాడు సారథి. లేని నవ్వు పెదవులపై పులుముకుంటూ.

"ఏమో నాయనా! పాతపాటో, కొత్తపాటో! ఆశలన్నీ నీ మీదే వుంచుకున్నాడు. అయినా శశికేం తక్కువరా. అందంగా కుందనపు బొమ్మలాగుంటే!"

"కుందనపు బొమ్మో — చందనపు బొమ్మో - ఇప్పుడదంతా ఎందుకమ్మా! ఇప్పుడు నా పెళ్ళికేం తొందరనీ! ఇప్పుడప్పుడే నా పెళ్ళి ప్రసక్తి తేవద్దు. అంత తొందరగా వుంటే వాళ్ళమ్మాయికే మరో సంబంధం చూడమను!" తీవ్రంగా అన్నాడు సారథి.

ఇంక ఎక్కువగా ఆ విషయం మీద ప్రస్తావిస్తే నేనీ పెళ్ళి చేసుకోనని మొండికేస్తాడని తెలుసుకుంది. మెల్లిగా వాడ్ని దార్లో పెట్టి, వాడిచేతే అవుననిపించాలనుకుందనసూయమ్మ....

చిరుకోపంతో "దానికేం గాని- దానికి కాలేజీ తెరిచారట! అది వెడతానంటోంది. రేపా సినిమా ఏదోచూపెట్టి ఎల్లుండి వాళ్ళ వూర్లు దిగబెట్టి రారా!.

ఇంక తప్పదన్నట్టు బుర్రవంచుకుంటూ "అలాగే" అన్నాడు. ఏదో సాకుతో తప్పించుకుంటున్నావు... అవును గాని అదేమిట్రా ఆ అన్నం తినడం."

"అన్నం కలుపుతున్నానమ్మా."

అపుడే ప్రవేశించిన శశి "కాదత్తా! అన్నం కెలుకుతున్నా" డంది నవ్వుతూ.

"నువ్వూరుకోవే పిల్లా!" అంది నవ్వుతూ అనసూయమ్మ!

ఆ మాటకి ముగ్గురూ నవ్వుకున్నారు.

అందులో ఏదవలేని నవ్వొకటి మిళితమైవుంది!

## 5

అప్పుడే మ్యాటినీ షో వదిలినట్టున్నారు. సినిమాథియేటరునుంచి జనం వల్చవల్చగా చెమటలు తక్కుకుంటూ బైటకు వస్తున్నారు. కొద్దిక్షణాల్లో బైటనుంచి వచ్చేపోయే ప్రజలలో-థియేటరు.. కిటకిటలాడిపోతోంది. వచ్చేపోయే కార్ల హారన్లు, సైకిలు రిక్షాల బెల్లుల రణగొణధ్వని, చెవులు చిల్లులు చేస్తున్నాయి. ఆడా- మగా, చిన్నా - పెద్దా, గొప్పా - బీదా, తారతమ్యంలేని అది ........ మరో(హా) ప్రపంచంలా వెలిగిపోతోంది.

రిక్షావాడికి డబ్బులిచ్చి పంపిస్తూ సారథి— "శశీ! నువ్విక్కడే వుండు. నే టిక్కెట్లు తీసుకువస్తా!-" అంటూ జనంలో కలిసిపోయేడు.

వేలికి చీరకొంగు మెలిదిప్పుతూ, వెళ్ళిపోతున్న సారథివంక చూసి.... వయ్యారంగా నవ్వుకుంది శశిరేఖ. ఆ నిమిషంలో ఆమె ఆనందం అందలమెక్కింది. బావకు తెలీకుండా పెండ్లి తాంబూలాలు పుచ్చుకున్న అత్తయ్య, అదే ధైర్యంతో బావతో తనని సినిమాకి పంపింది! అత్తయ్యకు మనస్ఫూర్తిగా మనస్సులో థేంక్స్ చెప్పుకుంది. ఇన్నాళ్ళకి తన మనసులో నిర్మించుకుంటున్న ఆశా సౌధాలకు నిజమైన పునాదులు పడ్డాయి. భగవాన్! నేనెంత అదృష్టవంతురాల్ని అనుకుంది మత్తుగా....మెత్తగా!

పది నిమిషాలు గడిచిపోయేయి.

సారథికోసం ఎదురు చూస్తోంది శశి.

బావకోసం వెదుకుతున్న ఆమె కళ్ళు వున్నట్టుండి ఒక దగ్గర ఆగిపోయేయి.

ఎవరో ఒక కొత్తజంట రిక్షానుంచి దిగుతున్నారు. అతను నవ్వుతూ చేయి నందివ్వగా ఆమె సిగ్గుతో అతని చేతిని ఊతగా తీసుకొని నాజూకుగా దిగుతోంది.

ఆ దృశ్యాన్ని, తన ఆశను మేళవించి ఆ జంట తనూ - బావగానూ ఊహించుకుంటూ ఆనందం ఆస్వాదిస్తోంది శశి.

అదే దృశ్యాన్ని, చూసి.... చీకట్లో.... పామునో, తేలునో తొక్కి, చెదరిపోయే వాడిలా నిశ్చేష్టుడై.... ఎక్కడివాడక్కడే నిలిచిపోయాడు. అంతకు కొన్ని క్షణాల క్రితం ప్రవేశిస్తున్న సారథి.

అతని చేతి వ్రేళ్ళ మధ్య టిక్కెట్లు గాలికి- బాధతో రెపరెపలాడుతున్నాయి.

తానిప్పుడే ఎవరినైతే చూసి భరించలేడో, ఆమే— ఆ రాధే, తనకళ్ళ ఎదుట ఆమె భర్తతో ప్రత్యక్షమైంది.

ఎవరి కళ్ళయినా ఎప్పుడైనా మోసపోగలవేమో కాని తనకళ్ళు మోసపోలేవు! తనకా నమ్మకముంది. అవును నిన్న కళ్ళారా చూసింది నిజం....

నిన్న అతనితో షికారు....ఈవాళ సినిమాకి!

తన్నింత సులువుగా మరచిపోయిందన్నమాట.

తనే జరిగింది మరువలేక- అవమానాలు మింగలేక, ఆమెకోసం కృంగి కృశించిపోవడం.

తన మీదేమాత్రం సానుభూతి, ప్రేమ లేవన్నమాట! ఛీ. ఛీ ఏం ఆడది! తనని చూసినా చూడనట్లు నటిస్తూ అతని చేయి పెనవేసుకుంటూ....ఎంత చొరవగా వెళ్ళిపోతోంది.... ముమ్మాటికీ తను అది గమనించాలని, తను ఇది చూసి కుళ్ళి కుళ్ళి చావాలనే చేస్తోందిదంతా! "రాక్షసి" కసిగా పళ్ళు కొరుక్కుంటూ అనుకున్నాడు జెలసీతో!

తన బలమైనచేతులతో- లాగి దవడదిరేలా కొడదామనుకొన్నాడు కోపంతో. అతనిలో తీవ్రమైన ప్రతీకార వాంఛ చెలరేగింది. అసూయ, క్రోధం- కట్లు తెంచుకొని వళ్ళంతా ప్రవహించి, వివేకం, విచక్షణా జ్ఞానాల్ని ముంచేస్తున్నాయి..

తనలాగే అందమైన కలల్లో తేలిపోతున్నాడనుకొంది, శశి అమాయకంగా!

తల పైకెత్తి "బావా! ఇంక లోపలికెళ్దామా?" అంది అతని కళ్ళల్లోకి అందంగా చూస్తూ.

నుదుట పట్టిన చెమట రుమాల్తో వత్తుతూ "అలాగే!" అన్నాడు సారథి.

అన్నాడు తప్పిస్తే అతని మనసు, మనసులోలేదు. బంగాళాఖాతంలో సైక్లోన్‌లా ఉప్పొంగిపోతోంది.

"అవును- తనూ ఆమెను ఖాతరు చేయకూడదు!...." జేవురించిన ముఖంతో గొణుక్కున్నాడు!

తనతో ఇన్నాళ్ళూ కలిసిమెలిసి తిరిగి - తన మనస్సు అద్దంలా - అర్థం చేసుకున్న రాధ.... ఈనాడు తనెలా భరించగలడని పరాయివానితో పూసుకు తిరుగుతోంది?.... తను బాధతో కుమిలి చావాలనేగా?.... అవును.... తనూ ఖాతరు చేయకూడదు.... ఎలా??

అప్పటికి తన కన్నెదుట తల వంచుకొని కాలిబొటన వ్రేలు నేలకు రాస్తూ.... శశి కనిపించింది.

తటాలున శశి భుజం మీద చేయివేసి ఆడిటోరియంలోకి దారితీసేడు. ఒక్కసారి శశి మేను ఝల్లుమంది. క్రీగంట విస్మయంగా సారథివైపు చూసి, అభ్యంతరం చెప్పకుండా— ఒంటినిండా పైట కప్పుకుంటూ సిగ్గుతో అతనితో దారి తీసింది.

అంత వరకు చిరునవ్వుతో రవి

ప్రక్కన ప్రశాంతంగా నడుస్తున్న రాధ తన పక్కనుంచి ఎవరితోనో వెళ్ళిపో తున్న సారధిని చూసి గతుక్కుమంది. మొహం తిరిగినట్లై భర్త వైపు కాస్త వొరిగింది. చటుక్కున రవి జబ్బ పట్టుకుని ఆపలేకపోతే నేలకు ఒరి గేదేమో.... క్షణకాలంలో తన్ను–తాను తమాయించుకొని నిల్చింది.

వద్దు వద్దుంటున్నా ఎదురుగా వున్న సోడా షాపులోని సోడా తెచ్చి బలవంతాన తాగించాడు రవి.

"ఎలా వుంది రాధా!" ఆప్యాయంగా అడిగాడు రవి.

"నా ముఖంలా వుంది!" అందామను కుంది రాధ.

తాగినసీసా అతనిచేతి కందిస్తూ "అబ్బే! ఏం లేదండీ! అడుగులు తడబడి జారిపడ బోయాను!" సగం మానసికమైన బాధ తోనూ, సగం ఎవరైనా చూస్తారన్నా చచ్చేటంత సిగ్గుతోను. మెల్లిగా సమా ధాన మిచ్చింది.

"దెబ్బేం తగలలేదుకదా!" ఆతృతతో అడిగేడు.

"లేదు పదండి!" ఇంక అక్కడ నిల వడం యిష్టంలేక భారంగా అడుగులేసింది.

"అమ్మయ్య! రక్షించావు" చిన్నగా నవ్వుతూ ఆమెతో దారితీసేడు.

ఆమె నడుస్తోంది. ఆమె మనస్సు పరి పరి విధాల పరుగెడుతోంది.

గేట్‌మన్ టిక్కెట్లు చించి పక్కకు తప్పుకున్నాడు.

రాధా - రవి ఆడిటోరియంలోకి ప్రవే శించారు.

పిక్చరింకా బిగిన్ కాలేదు.

నుదుటిమీద వీభూతి పిండి కట్లల్లా – వర్తులాకారపు మూడు వరుసలలో బాల్కనీ కుషన్సు అమర్చబడ్డాయి. ప్రతి వరుస నడిబొడ్డున, కొన్నడుగుల మేర ఖాళీ. అక్కడనుంచి తిరిగి కుషన్లు అమర్చబడివున్నాయి. నీలి కవరు స్పాంజి సీట్లు లైట్ల కాంతికి ధగధగ మెరిసిపోతున్నాయి.

వద్దు వద్దనుకుంటున్నా ఆమె కళ్ళు వాటికావలసిన వ్యక్తి కోసం వెతుక్కో వటం మొదలెట్టాయి.

"రాధా! ఇక్కడ కూర్చుందాం. రాణీ గారు అలసిపోయినట్టున్నారు. ప్లీజ్ బీ సీటెడ్!" చిరునవ్వుతో అంటూ కుడి వైపు సీటామెకు చూపిస్తూ ఎడమవైపు తను కూర్చున్నాడు.

అరవై మైళ్ళ వేగంతో పోతున్న కారు యాక్సిడెంటల్‌గా వేసిన బ్రేకుతో– ఒక్క కుదుపుతో ఆగినట్లాగింది రాధ! అదే వర సలో ఆమెకు కొన్నడుగుల దూరంలో


# జలుబు వల్ల ఓ మంచి రోజును పాడవనివ్వకండి



## జలుబును పోగొట్టుకోవచ్చు

ముక్కు కారడం, ముక్కు దిబ్బెడ, తలభారం, గొంతు నొప్పి, గుండెలో కఫం చేరడం లాంటివన్నీ మీ మంచి రోజుల్ని పాడు చేస్తాయి. అయితే, ఈ లక్షణాలుగల జలుబునుంచి ఉపశమనానికి ఓ మార్గం ఉంది.

## జలుబు మందుతో వాటిని ఎదుర్కోండి

ఏ ఇతర జబ్బుకో చికిత్స చేసినట్టు జలుబుకి చికిత్సచేస్తే చాలదు. జలుబు లక్షణాలకు లోనైన అన్ని చోట్లా ఒకే మారుగా పనిచేసే ప్రత్యేకమైన మందే వాడండి.

## కోల్డరిన్ కేవలం జలుబు కోసమే

మిమ్మల్ని ఇబ్బంది పెట్టే అన్ని జలుబు లక్షణాలనుంచి ఉపశమనం కలిగిస్తుంది కోల్డరిన్. దీనిలోని ప్రత్యేకమైన ఔషధ పదార్థాలు జలుబు లక్షణాలుగల అన్నిచోట్లా కలిసికట్టుగా పనిచేస్తాయి. పైగా మీ శరీరంలో నిరోధక శక్తిని పెంచే విటమిన్ సి దీనిలో ఉంది. మీకు జలుబు చేస్తే, దానికి ప్రత్యేకమైన జలుబు మందే వేసుకోవడం ఉత్తమం.



# కోల్డరిన్

జలుబు కోసం ప్రత్యేకంగా తయారుచేయబడింది

CASBC-64-232 TL

సారధి.... ఇంకో స్త్రీతో కూర్చోవడం అప్పో కంటబడింది.

పాలిపోయిన మొహంతో, నీరసంగా వాలిపోయింది రాధ!

సారధి తన ప్రక్కనున్న శశి వైపు తిరిగి నవ్వుతూ.... చేతులూపుతూ ఏదో మాట్లాడుతున్నాడు.

తనను వడిసెత్తిన తళతళా వెలుగుతున్న బల్బు ఒక్కసారి చిట్లి తన నెత్తిన పడితే బాగుండుననుకుంది రాధ బాధగా!

మరోసారి తనని విధాత చిన్న చూపు చూశాడు.

అవును.... తను తల్లి పొందలేక పోయినా.... తను అతణ్ణి అందుకో లేక పోయినా, తనింతకాలం జీవించగలిగిందంటే— తనని జీవితంలో.... మనసిచ్చి ప్రేమించేవారొకరున్నారన్న ఆ ఒక్క సంతృప్తేగదా:...

తనకా అదృష్టంకూడా లేకుండాచేశాడు భగవంతుడు! తనంత దురదృష్ట జాతకురాలుండదేమో!

ఇటు అతన్ని మరువలేక, అటు భర్తను సుఖపెట్టలేక, తనెంత నలిగి నలిగి క్షణ క్షణానికి చస్తోందో అతనికేం తెలుస్తుంది! ఆ బాధ ఆవగింజలో అరవీస మెత్తయినా అతనిలో కనిపిస్తోందా...

అవును, అతనెందుకు బాధపడాలి? మగ మహారాజు! ఏం చేసినా చెల్లుతుంది. నేను కాకపోతే మరొకతె.... అదీ కాకపోతే ఇంకొకత్తె. ఛీ. ఛీ.. ఏం మనిషి? రోత పుడుతూ వుంది!

ఆ నాడు తను లేందే బ్రతకలేనన్న మనిషి— ఈ నాడు తన బ్రతుక్కర్థం లేకుండా చేశాడు! అసలీ మనిషేనా అలా అన్నది? ఇంకా నయం ఇప్పటికైనా

మూలశంకకు
త్వరగా
నమ్మకమైన
హెడన్‌సా
విరేచనముతో
చికిత్సను పొందండి
–శస్త్రచికిత్స
అవసరములేదు!

అతని నిజస్వరూపం తెలుసుకో కలిగింది!

ఎర్రగా, బుర్రగా ఉన్నాడని తనూ, అందం ఆకర్షణా ఉన్నాయని అతను కళ్ళు బైర్లుకమ్మి ఏవేవో కలలుగన్నారు. దానికి "ప్రేమ"అని పేరుపెట్టి— ఆ పదాన్ని నాశనం చేశాం!

ఛీ....ఛీ.... పెళ్ళయిం తర్వాతకూడా అతని కన్యాయం చేశానని తానెంత దుఃఖించింది. ఎదిరించే శక్తి తనకు లేదని, తన బలహీనతకు తానెంత కుమిలి కుమిలి ఏడ్చింది! నిజంగా....ఆనాడు తన తండ్రి నెదిరించివుంటే భగవాన్! ఆడదాన్ని ఆట బొమ్మగా ఆడుకునే ఓ కసాయివాడి చేతిలో పడవలసివచ్చేది! ఊహిస్తున్న కొద్దీ భయం తన జీవితాన్ని చూసి తన మీద తనకే జాలివేస్తోంది.

అంతులేని ఆలోచనలతో ఆమె తల బద్దలై పోతూంది. అసూయ, అవమానాలతో ఆమె వళ్ళంతా దహించుకు పోతూంది.

ఆపుకోలేని వేగంతో పరవళ్ళు తొక్కుతూ ప్రవహించే సెలయేరులా ఆమె కంటివెంట పొరలు పొరలుగా అశ్రుధారలు ప్రవహిస్తున్నాయి.

చేతిలోని రుమాల్తో కన్నీరు తుడుచుకుంటూండగా అప్రయత్నంగా ఆమె మోచేయి భర్త భుజానికి తగిలింది. ఆ స్పర్శతో ఒక్కసారి ఈ లోకానికి వచ్చింది.

ఆమెకు వంత పాడినట్టు తెర మీద బొమ్మలు కూడా ఏడుస్తున్నాయి.

అప్పటికి సినిమా మొదలయి ఎంత సేపయిందో ఆమెకే తెలియదు.

అంతవరకు సినిమాను ఆసక్తితో చూస్తున్న రవి భుజం తడుముకుంటూ— కంటి నీరు ఒత్తుకుంటున్న రాధని గమనించి మెల్లగా, చిరునవ్వుతో "ఎలా వస్తుందో నీకు ఏడుపు ఆ రుమాలు చాలా, ఇంకో రుమాలు కావాలా? వాళ్ళేడవడం మొదలు, శృతి కలుపుతారు. ఎలా బ్రతకడమో మీతోటి?" అంటూ తిరిగి సినిమా గమనించడం మొదలెట్టాడు.

అంత దుఃఖంలోనూ- తన విషయం తెలియక అమాయకంగా అంటున్న భర్త మాటలను విని నవ్వుకుంది రాధ!

సినిమాయే నయం. మూడుగంటల కథలోను ఎన్ని ప్రళయాలొచ్చినా, చివరి క్షణంలోనైనా.... అందంగా, ఆనందంగా సమాప్తమై కథ కంచికెడుతుంది.

తనూ అందంగా ఉన్నానన్న గర్వం తప్పిస్తే తన జీవితంలో అందం— ఆనందం ఏది? తన బ్రతుకింతే! పెద్ద ఆరిందాలా- విరక్తిగా అనుకుంది.

తనే - అతని సర్వమని చెప్పిన మనిషి, ఈనాడు కనీసం తను కొన్నడుగుల దూరాన వున్నానన్న విషయం గుర్తించక, పరాయిస్త్రీతో ఎంత కులాసాగా వున్నాడు? తలుచుకుంటేనే చాలు అసహ్యమేస్తోంది.

తననంత సులభంగా మరిచిపోయిన వాడి గురించి తానెందుకింత దుఃఖించడం? అతనికి తనెవరూ కాదు! అలాటపుడు అతన్ని ప్రేమించడంలో అర్థమేముంది? తనని ప్రేమిస్తూ తన కోసం బాధపడే వాడి గురించి తను అనుక్షణం తలచినా అర్థమేముంది.

అవును గతించింది ఒక పీడకలగా తనూ తలచి మరచిపోవాలి.

నిజంగా తన ప్రక్క అమాయకంగా కూర్చున్న తన భర్తనెంత మోసగిస్తూంది? తనెంత విసిగించినా ఓర్పుతో సహిస్తూ తనని క్షమిస్తూ వస్తున్నాడు. అతని ఓర్పు నశించకముందే తన దారిలో తను పడాలి. అతనికేం తక్కువని?

మెరుస్తున్నకళ్ళతో.... "హు! ఏ విషయంలోనైనా తన భర్త కాలిగోటికి సారధి సరిపోగలడా?" మెల్ల మెల్లగా గొణుక్కుంది.

అప్పటికి ఆమె హృదయంలో భీకరంగా చెలరేగుతున్న తుఫాను చల్లారింది.

ఇంటర్‌వెల్ ఇచ్చినట్లున్నారు. హాలంతా లైట్లకాంతికి తళతళ మెరిసి పోతోంది.

సారధి రాధవైపు చూశాడు.

రాధ సారధివైపు చూసింది.

ఒకరినొకరు నిర్లక్ష్యంగా — అవమానంతోనూ, అనుమానంతోనూ, అసూయతోనూ, అనూహ్యమైన అసహ్యంతోనూ చివరిసారిగా చురచుర చూసుకున్నారు.

అంతే! ఆ షాకుతో.... ఒకరి హృదయాల్లో వెలుగుతున్న మరొకరి రూపాలను కసిగా చెరిపేసుకున్నారు.

అదే రాత్రి...

మంచినీళ్ళచెంబు మేడమీదపెట్టి వెడుతున్న శశి భుజం నొక్కుతూ సారధి 'పెళ్ళాడ్డానికి సిద్ధంగా వుండు పిల్లా!' అన్నాడు ఆమెను దగ్గరకు తీసుకుంటూ.

శశి పువ్వులా సిగ్గుతో ముకుళించుకు పోయి— ముచ్చటగా నవ్వుకుంది. అతని చూపుల్ని ఓపలేక తప్పుకుంటూ కిందికి పరుగు తీసింది.

అదే సమయంలో....

రాధ, రవి భుజం కన్నీట తడిపింది.

రవి— కలో నిజమో తెలుసుకోలేక.

ఆమె ముంగురులు చిరునవ్వుతో సవరిస్తున్నాడు.

చంద్రుడు జెలసీతో మబ్బుల చాటుకు తప్పుకున్నాడు. ●